

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రెండు దృశ్యాలు

"నా కివాళ కారు కావాలి" దీప చెప్పింది.

"సారీ. నాకు కావాలి. ఇవాళ నేను లేటుగా వస్తాను. కేబ్ తెప్పించుకో" శ్రీమంత్ కారు తాళం చెవులు తీసుకుంటూ చెప్పాడు.

"మీ సలహా నాకు అవసరం లేదు. నా సంగతి నేను చూసుకోగలను" విసురుగా లోపలికి నడిచింది దీప.

అంతే విసురుగా బయటకి నడిచాడు శ్రీమంత్.

దీప తమ ఫేమిలీ ఫ్రెండ్ పర్మీందర్‌కి ఫోన్ చేసింది.

"నాకు ఇవాళ కారు కావాలి. మా కారు శ్రీ తీసుకెళ్ళాడు. "

"నా కారుకి ఇవాళ పనిలేదు దీపా. డ్రైవర్ కూడా ఖాళీగా కూర్చున్నాడు. నాకు ఇంట్లో బోలెడంత పని. ఏ టైమ్‌కి కావాలి? " పర్మీందర్ అడిగింది.

"చాలా థాంక్స్... పదకొండుకి పంపితే హేపీ. డ్రైవర్ అవసరం లేదు." దీప ఆనందంగా చెప్పింది.

పావుగంటలో పర్మీందర్ డ్రైవర్ కారు కీస్ ఇచ్చి, దీప ఇచ్చిన వందనోటుని తీసుకుని వెళ్ళిపోయాడు.

చాలా రోజుల తర్వాత దీప చాలా శ్రద్ధగా తయారైంది. బీరువా ముందు దాదాపు పావుగంటకి పైగా నుంచుని, ఏ చీర కట్టుకోవాలా అని ఆలోచించింది. చివరికి ఎర్రటి చీర, జాకెట్ తీసింది. ఆ రంగు తన రంగుని రెట్టింపు చేసి చూపిస్తుందని దీపకి తెలుసు. లైట్ మేకప్‌లో అందంగా తయారై బయటకి నడిచింది.

గంట తర్వాత కారు ఢిల్లీలో ఒక పెద్ద హోటల్ ముందు ఆగింది. రిసెప్షన్ లాంజ్‌లో కూర్చుని ఎదురుచూస్తున్న అభయ్ ఆమె మిస్డ్ కాల్ చూసి బయటకి వచ్చాడు. చిరునవ్వుతో ఆమెని విష్ చేసి పక్క సీట్లో కూర్చున్నాడు. కారు కదిలింది.

"ఎక్కడికి వెళదాం?" అడిగింది దీప.

"ఎక్కడికైనా. జనసంచారం తక్కువగా ఉన్న ప్లేస్ అయితే బెటర్."

"సరే. ఇక్కడికి కొద్ది దూరంలో ఓ పార్సీ టెంపుల్ ఉంది. సాధారణంగా అక్కడకి ఎవరూ రారు. మన తెలుగు వాళ్ళు అసలురారు. ఓకేనా?"

"డబుల్ ఓకే. నువ్వు నా రథసారథివి. నీ ఇష్టం" నవ్వాడు.

"నువ్వు కొద్దిగా లావయ్యావు. జుట్టు కొంచెం పల్చబడింది. పెద్దమనిషి తరహాగా ఉన్నావ్.. అభయ్!" చెప్పింది దీప. 'ఐనా చాలా బావున్నావు' మనసులో అనుకుంది.

"దీపా. నీలో అస్సలు ఏ మార్పూ లేదు తెలుసా? మనం కలిసి ఎంతకాలమైంది? ఎయిట్ ఇయర్స్ అవట్లా? మైగాడ్ వయసుని ఎలా జయించావు?" ఆరాధనగా చెప్పాడు అభయ్.

స్వల్పంగా సిగ్గుపడింది దీప.

గుడి ఆవరణలో కారాపి, నెమ్మదిగా మెట్లవైపు నడిచారు. "చాలా థాంక్స్ దీపా." ఆమె మునివేళ్ళని మృదువుగా స్పర్శిస్తూ చెప్పాడు అభయ్.

"ఎందుకు? నేను నిన్ను కలవడానికి రాను అనుకున్నావుకదూ? నన్నంతగా గుర్తుపెట్టుకుని, మా ఇంట్లో నా నంబర్ తీసుకుని నాకు కాల్ చేసినప్పుడు నేను నిన్ను కలవనని ఎలా అనుకున్నావ్ అభయ్?" చిరుకోపంగా అడిగింది దీప.

"నువ్వు రావనే అనుమానమే లేదు. నేను థాంక్స్ చెప్పింది నా కిష్టమైన ఎర్రరంగు చీర కట్టుకున్నందుకు. నువ్వచ్చం గులాబీ పువ్వులా ఉన్నావు దీపా అంటే సుకుమారంగా."

"ఇక్కడ కూర్చుందామా? ?" ఓ మెట్టు మీద కూర్చుంది దీప.

ముభావంగా ఆమె పక్కనే కూర్చుంటూ ఇబ్బందిగా చెప్పాడు అభయ్. "సారీ పరాయివాడి భార్యవైపోయినా పొగుడుతున్నాను. ఏమీ అనుకోకు దీపా. నిజానికి నాకు చాలా మెచ్యూరిటీ వచ్చింది, హుందాగా బిహేవ్ చేస్తున్నాను అని నా గురించి అనుకుంటూ ఉంటా. కానీ నీ దగ్గర మళ్ళీ మన బి.ఎస్సీ రోజులకి వెళ్ళిపోయాం"

"లేదు అభయ్. మనం కలిసిన అరగంటలో నువ్వు నేను అందంగా ఉన్నానని చెప్పావు. నాలో వయసు తెచ్చిన మార్పు లేదన్నావు. నేను గులాబీలా సుకుమారంగా ఉంటానన్నావు. కానీ నువ్వు నమ్ముతావా మా పెళ్ళిరోజునుంచి ఈరోజు దాకా శ్రీ ఒక్కసారి కూడా నన్ను మెచ్చుకోలేదు. అసలతను నా మొహమే చూడడు. నేనంటే ఎంత నిర్లిప్తంగా ఉంటాడంటే.." దుఃఖంతో దీప భుజాలు ఎగిరిపడుతూండగా చేతుల్లో మొహం దాచుకుంది.

"ప్లీజ్ దీపా ఏడవకు. నిజం చెప్పాలంటే మాలతి కూడా అంతే, తనలో ఓ సౌకుమార్యం కానీ, స్త్రీత్వం కానీ చూడలేదు నేను. నవ్వితే అదేదో అపరాధమేమో అన్నట్లు బ్లాంక్ ఫేస్ అదే చెక్కమొహంతో తిరుగుతూంటుంది. ఎప్పుడైనా సరదాగా ఏదైనా జోక్ వేస్తే ముఖం చిట్లించి, 'ప్లీజ్ అభయ్. మీ వయసుకి తగ్గట్లు ఉండటం నేర్చుకోండి' అని ఉపన్యాసాలిస్తుంది. అందుకే నేనసలు మాట్లాడటం మానేసాను. ఈ ఢిల్లీ కాన్ఫరెన్స్‌కి కూడా అందరూ వాళ్ళ పార్టనర్స్‌తో సరదాగా గడపడానికి వస్తే, నేను కేవలం నిన్ను చూడచ్చనే వచ్చాను. తను డాక్టరని మా మాలతికి కొంచెం పొగరు. ఐనా తన వెంటబడి వచ్చింది నీ కోసమే" ఆవేదనగా చెప్పాడు అభయ్.

"డాక్టర్స్ అంతా అంతేనేమో" నవ్వింది దీప.

"అబ్బ తడి కళ్ళతో నువ్వు నవ్వుతూంటే వాన వెనకే ఎండొచ్చినట్లుంది దీపా" మెచ్చుకున్నాడు అభయ్.

దీప మొహంలో మళ్ళీ విషాద మబ్బులు అలుముకున్నాయి.

"శ్రీ ఎంత నిర్లిప్తంగా ఉంటాడంటే నేనతన్ని ఓ ప్రశ్న అడిగాను. 'నేను ఏదైనా పెద్ద మాస్ ఏక్సిడెంట్‌లో చిక్కుకుంటే, మొహం పాడైందనుకోండి, శరీరాన్ని గుర్తించాలంటే, శరీరం మీద పుట్టుమచ్చలు ఎక్కడున్నాయో తెలుసా?' అని దానికి అతనిచ్చిన సమాధానం –

పనీపాటా లేకుండా ఇంట్లో కూర్చుంటే ఇలాంటి ఆలోచనలే వస్తుంటాయ్. అని. బట్, డాక్టర్‌గా కేవలం వృత్తి పరమైన ఆసక్తితో దేహాల్ని చూసే శ్రీమంత అతనికి భార్యమీద ఆ ఆసక్తి లేదు"

అభయ్ సానుభూతిగా ఆమె కళ్ళు తుడిచి చెప్పాడు.

"కాలేజ్ రోజుల్లో ఇష్టపడ్డాం. పెద్దవాళ్ళకి చెప్పే ధైర్యం లేక విడిపోయాం. ఇన్నేళ్ళ తర్వాత నీ సంసార జీవితం ఎలా ఉందోనన్న ఆసక్తితో నేను, అదే ఆసక్తితో నువ్వూ కలుసుకున్నాం. మే బీ నువ్వు హేపీగా ఉన్నావని తెలిస్తే నేను, నేను సంతోషంగా ఉన్నానంటే నువ్వు బాధపడేవాళ్ళమేమో! మనం మళ్ళీ కలవకపోవచ్చు. ఈ రోజు సరదాగా కబుర్లు చెప్పుకుందాం దీపా."

దీప అంగీకారంగా నవ్వి చెప్పింది.

"నిజమే. నువ్వు మాలతితో సంతోషంగా ఉన్నావని తెలిస్తే తెగ బాధపడిపోయేదాన్ని."

ఆ తర్వాత దాదాపు రెండు గంటలపాటు వాళ్ళు తను కాలేజ్ రోజులు, ఆ నాటి మిత్రులు, చిన్న చిన్న సరదాలు, చిలిపి పనులు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ, గుర్తుచేసుకుంటూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

కాన్ఫరెన్స్ ముగియగానే మూడో వరసలో కూర్చున్న శ్రీమంత్ ఐదో వరసలోని మాలతి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"బయలుదేరదామా?"

"ఓకే శ్రీ" ఓసారి చీరకుచ్చిళ్ళు సవరించుకుని అతని వెంట నడిచింది మాలతి.

'మాలతి కొద్దిగా లావైంది. వయసులో వచ్చే గాంభీర్యం విద్యవల్ల వచ్చిన కళతో హుందాగా ఉంది' మనసులోనే మెచ్చుకున్నాడు శ్రీమంత్.

"శ్రీ" నువ్వు పెద్దగా మారలేదు. కాలేజ్ కుర్రాడిలోనే ఉన్నావు. ఏం తింటున్నావు? ఎక్సర్ సైజ్ చేస్తావా?" ఆసక్తిగా అడిగింది మాలతి.

"హు" దీర్ఘంగా నిట్టూర్చాడు శ్రీమంత్.

"ఏమైంది?"

"మా దీపకి హెల్త్ పిచ్చి, మేకప్ పిచ్చి, శుభ్రం పిచ్చి. సమస్త పిచ్చులూ ఉన్నాయి. పిచ్చులు అనచ్చో లేదో నాకు తెలీదు కానీ మల్టిపుల్ డిజార్డర్స్ అనచ్చు. దాంతో నూనె లేని వంటలు చేస్తుంది. నెయ్యి తిని ఆరేళ్ళయింది. వానొచ్చినా, పిడుగులు పడినా జిమ్‌కి వెళ్ళాల్సిందే లేదంటే సాధించి చంపుతుంది. చచ్చిపోతున్నాననుకో" విసుక్కున్నాడు శ్రీమంత్.

"నువ్వు దీపమాట వింటున్నావు శ్రీమంత్. ఎంత మంచివాడివి? నేనూ అభయ్‌కి ఎప్పుడూ చెప్తాను. జిమ్‌కి వెళ్ళు, తిండి తగ్గించు అని. నా మాట ఒక్కటీ వినడు. ఇంకా నన్ను చిన్నపిల్లలా తయారవమని పోరు పెడతాడు. జుట్టు విరబోసుకో. కాటన్ చీరలు మానేసి సిల్క్‌వి కొనుక్కో. లిప్‌స్టిక్ వాడు అని గొడవ. నేను డాక్టర్ని అంటే, డాక్టర్స్ ఇలా ఉంటేనే వైద్యం చేయగలుగుతారా? అని ఆర్గ్యుమెంట్స్ అబ్బ చచ్చిపోతున్నాను" విసుగ్గా చెప్పింది మాలతి.

"దీప కూడా అంతే, ఎక్కడికైనా వెళ్ళాలంటే చాలు గంటలతరబడి తయారవుతుంది. పోన్లే అనుకుంటే, ఎదురుగా నిలబడి 'ఎలా ఉన్నాను' అని అడుగుతుంది. రోజు రోజుకీ ఏం మార్పులుంటాయ్ చెప్పు. నిన్నటిలానే ఇవాళ, ఇవాల్టి లాగే రేపు ఉంటాం అంటే కానీ తయారైనప్పుడల్లా ఎలా ఉన్నాననే ప్రశ్న ఏమిటో అర్థం కాదునాకు. ఒక్కోసారి పజిల్స్ కూడానూ, 'నాలో చిన్నతేడా కనిపెట్టండి' అంటూ. ఏమో తెలీదు నువ్వే చెప్పు అంటే 'రోజులా గుండ్రటి బొట్టు కాకుండా ఇవాళ పొడుగు బొట్టు పెట్టుకున్నాను. అది కూడా

గుర్తించలేకపోయారు. మీ పేషెంట్ నైనా బావుండేది, అణువణువూ శ్రద్ధగా గమనించేవాళ్ళు' అని సాధింపులు, ఏడ్పులూ ముప్పై ఆరేళ్ళు వచ్చినా మెచ్యూరిటీ లేదు. ఆ ఏజ్‌లో ఎలా ఉండాలి? అచ్చం నీకులా, హుందాగా" మెచ్చుకోలుగా చెప్పాడు శ్రీమంత్.

"హు. నువ్వెలా అంటావ్. అభయ్ ఏమో నలభై రాకుండానే ముసలమ్మవై పోయావు. ఆ జుట్టు ముడి ఏంటీ, నూలు చీరేంటి అని తెగసాధిస్తాడు. డాక్టర్‌వని నీకు టెక్కు అంటాడు. కొట్టొచ్చే రంగులు, గాడీ డిజైన్లు వేసుకోమంటాడు. నాకు లేత రంగులంటే ఇష్టం అంటే, నాకు అసహ్యం అంటాడు" దిగులుగా చెప్పింది మాలతి.

"లేదు.. లేదు నువ్విలాగే ఉండు. ఎంత బావున్నావో తెలుసా? నిర్మలంగా దేవతలా ఉన్నావు. నీలాంటి మంచి డాక్టర్‌కి ఆ తళుకు బెళుకులు, ఆ నకిలీ చమక్కులు అక్కర్లేదు" ఆరాధనగా చెప్పాడు శ్రీమంత్.

"శ్రీ! నిజంగా చెప్తున్నా. ఢిల్లీలో మెడికల్ కాన్ఫరెన్స్ అన్నప్పటి నుంచి ఎంత ఆలోచించానో! నీ గురించి లక్కీగా లిస్ట్‌లో నీ పేరు, ఫోన్ నంబర్ కనపడగానే వెంటనే కాల్ చేసాను. మెడిసిన్ చదివేపుడు ఆ ఐదేళ్ళూ ప్రేమించుకున్న మనం పెద్దవాళ్ళకి చెప్పే ధైర్యం లేక వాళ్ళు చెప్పిన వాళ్ళని చేసుకున్నాం. ఎంత డాక్టర్ నైనా నేనూ మనిషినేగా. నీ భార్య అందంగా ఉంటుందని నీ పెళ్ళికి వచ్చిన మన క్లాస్‌మేట్స్ చెప్పారు. డబ్బున్న అందమైన భార్యతో ఆనందంగా కాలం గడుపుతున్న శ్రీమంత్ నన్ను గుర్తుపడతాడా, నాకోసం ఓ అరగంటైనా టైమ్ కేటాయిస్తాడా అని మథనపడ్డాను. దీప మీద అసూయపడ్డాను కూడా. కానీ అందమైన దీపకన్నా ఈ రోజుకీ నువ్వు నన్నే ఇష్టపడుతున్నానని నీ మాటలవల్ల తెలిసింది. ఐ యాం సారీ. నీ ఫేమిలో లైఫ్ బావుండనందుకు నేను చాలా ఆనందపడుతున్నాను." మాలతి ఉద్విగ్నంగా చెప్పింది.

"నేను కూడా. మెడిసిన్ చదివిన నీకు బి.ఎస్సీ చదివినవాడితో పెళ్ళని విని ఆశ్చర్యపోయాను. అతను బాగా డబ్బున్నవాడని తెలిసి ఈర్ష్యపడ్డా.. ఇప్పుడు నాకు కూడా సంతోషంగా ఉంది" శ్రీమంత్ నవ్వాడు.

"మనిద్దరం మళ్ళీ జీవితంలో కలుసుకోకపోవచ్చు శ్రీ కొద్దిసేపు ఫేమిలీలని పక్కన పెట్టి మాట్లాడుకుందామా?" అడిగింది మాలతి.

ఆ తర్వాత దాదాపు రెండు గంటలపాటు వాళ్ళు మెడికల్ కాలేజ్ రోజులని, హౌస్‌మెన్ షిప్ అనుభవాలని, తాము ఎదుర్కొన్న క్లిష్టమైన కేసులని, ప్రస్తుతం సమాజంలో తమకి మంచి డాక్టర్‌గా ఉన్న పేరుని అన్నిటినీ ఏకధాటిగా పంచుకుంటూనే ఉన్నారు.

బెల్ మోగింది. తలుపు తీసిన దీప 'హాయ్' అని అతన్ని పలకరించి చేతిలోని బేగ్, కోటు అందుకుంది.

"నేను తినేసే వచ్చాను" ముభావంగా చెప్పాడు శ్రీమంత్.

"ఓ! సరే. గుడ్ నైట్."

ఆ రాత్రంతా వారిద్దరూ అభయ్, మాలతితో గడిపిన క్షణాలనే నెమరువేసుకుంటూ ఉండిపోయారు.

"కాన్ఫరెన్స్ బాగా జరిగిందా?" భార్యని గదిలోకి ఆహ్వానిస్తూ అడిగాడు అభయ్.

"ఆc. నాతో చదివిన ఫ్రెండ్స్ కనిపిస్తే డిన్నర్‌కి వెళ్ళాను." చెప్పింది మాలతి.

"ఓ.కే డియర్. గుడ్‌నైట్"

ఆ రాత్రంతా వారిద్దరూ దీప, శ్రీమంత్‌లతో తాము గడిపిన అమూల్య క్షణాలని తలచుకుంటూనే ఉన్నారు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story